# గుర్రం

రూపాయి తొంభై పైసల్లోనే ఏదో గల్లంతైంది. జనం లేచి పోయేరు. ఏమైందో ఎవరికీ తెలీదు. సినిమా ఆగిపోయింది. దీపాలు వెలిగి పోయేయి.

'ఏట్రో - రూపాయా తొంభై పైసల్లోనే గలాటా. ఆల్లంతా డబ్బున్నోల్లు. పెద్దోల్లు. ఏటో జరిగింది రోవ్...' చిల్లర క్లాసులోంచి ఎవడో అన్నాడు.

మధ్య క్లాసువాళ్ళందరూ మొదట మెడకాయలు వెనక్కి తిప్పేరు. తరవాత వొళ్ళంతా వెనక్కి తిప్పి, మెడలు సారించి కళ్ళజోళ్ళలోంచి చూసేరు.

హాలు యజమాని గబగబ రూపాయి తొంభై పైసల్లో కొచ్చేడు. అక్కడ గుమిగూడిఉన్న ప్రేక్షకుల్ని 'ప్లీజ్ ప్లీజ్' అంటూతోసుకువెళ్లేడు.

ఎవరో మొగం తిరిగి పడిపోయేరు. ఆడదా, మగాడా? మగాడే. బాగానేవున్నాడు. దిమిశా దుక్కలా వున్నాడు.

ఎవడో 'హార్టు' అన్నాడు. ప్రక్కనున్న సర్టిఫికేట్ల డాక్టరు అతని గుండెమీద చెయ్యేసి 'కొట్టుకుంటుందే' అన్నాడు. ఒక ఫైనలియరుబొమ్మ నాడిచూసి 'బాగానేవుంది.' అంది.

రామనాధం మూర్ఛపోయేడు. శవాన్ని మోసినట్టు నలుగురతన్ని బైటపడేశారు. జగన్నాధస్వామిని రధంలో పెట్టినట్టు ప్రొప్రయిటరు

రామనాథాన్ని స్వంత కారులో యెక్కించి పెద్దాసుపత్రికి మోసుకుపోయేడు. దీపాలారేయి. తిరిగి సినిమా ఆరంభమైంది.

హౌస్సర్జను రామనాథం మొహంమీద మొహంపెట్టి 'ఎలాఉందండీ' అన్నాడు. రామనాథానికి ఎనస్తిషియా మత్తు వదుల్తున్నట్టు కాస్త తెలివొస్తూంది.

'నీరసంగా వుంది...' మూలిగేడు.

'నర్స్, ఈయనకి కాస్తా వేడివేడి కాఫీ తీసుకురా...' డాక్టర్. నర్స్ చకచకా వెళ్ళింది. రామనాథం పక్కమీదలేచి కూచోబోయేడు.

'నోనో! నీరలాగే పడుకోండి. మీకిలా అవడం ఇది మొదటిసారా?' డాక్టరు.

నర్సు కాఫీ తెచ్చింది. డాక్టరు అనుమతిమీద రామనాథంలేచి కూచుని కాఫీ చప్పరించేడు.

'గాభరా పడకండి నిమ్మళంగా తాగండి' నర్సు ఈ కాలుమీంచి ఆ కాలుమీదికి మారి అంది. ఠీవిగా నిలబడింది. ఆమె భంగిమచూసి రామనాథానికి చెయ్యి వొణికింది.

'గాభరా పడకండి. మీ హార్టు బాగానే వున్నట్టుందే...' డాక్టరు.

'నాకు గుండెజబ్బులేదు డాక్టర్...' రామనాథం.

'నాకు తెలుసు. మరివాళ యేం తిన్నారు? ఎదైనా అజీర్ణంచేసే వస్తువు...'

'గుర్రం...' రామనాథం నీరసంగా నసిగేడు.

డాక్టరు నర్సువేపు చూశాడు. నర్సు డాక్టరువేపు చూసింది.

'మీరేదో గుర్రం అంటున్నారు...' డాక్టరు.

'ఔను డాక్టర్, నాకు గుర్రం అంటే భయం...'

మళ్ళీ డాక్టరు నర్సువేపు చూసేడు: నర్సు డాక్టరువేపు చూసి, పెదిమ విరిచి, మెడ కదపకుండా అదో నృత్య విశేషంలా తల అటూ ఇటూ కదిపింది.

'హుఁ! మీరు గుర్రాన్ని ఎక్కడ చూసేరు?' డాక్టరు.

సినిమాలో నాయకుడూ, నాయకీ పంచకళ్యాణియెక్కి, దౌడు తీయించి, తెరమీంచి సరిగ్గా నామీదికి దూకించేరు, అంతే. తెలివొచ్చేసరికి, ఇదిగో ఈ పక్క మీదున్నా...'

నర్సు నోటికి చెయ్యడ్డం పెట్టుకుని నవ్వాపుకుని, 'పీఛే ముడ్' అన్నట్టు యెబౌటర్నుకొట్టి హంసలా నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

రాత్రి పదకొండున్నరైంది.

'చూడండీ' ఈ మాత్ర వేసుకోండి... రైట్... ఈ వార్డులోకి గుర్రాలురావు. హాయిగా పడుకోండి. రేపుదయం చెయ్యవలసిన టెస్టులు చేయించి, మిమ్మల్ని సాయంత్రం డిశ్చార్జి చేయిస్తా... మీరేం చేస్తారు?'

రామనాథం చెప్పేడు.

'ఈ వూరొచ్చి ఎన్నాళ్ళయింది?'

'నాదీ వూరే...'

'ఓ.కె... పడుకోండి.'

పెద్ద గాడిదలా వున్నాడు. గుర్రపంటే భయంట. ఫూల్ అనుకున్నాడు డాక్టర్.

రామనాథానికి గుర్రాలు అంటే అతి భయం. ఆ మధ్య వూరెళ్ళి తిరిగొచ్చేడు. రైలుబండి స్టేషను చేరేసరికి రాత్రి పది దాటింది. కర్మగాలి ఆవేళ రిక్షాల్లేవు. రిక్షా సోదరులంతా సమ్మె కట్టేరు. ఒకేఒక జటకావుంది. ఎంత చచ్చులావున్నా జటకా గుర్రం గుర్రావేమరి. నడిచిపోదామంటే పెట్టె, బెడ్డింగున్నాయి. చివరకి తెగించి జట్కా ఎక్కేడు. జటకా చావులమదుం దగ్గర కొచ్చేసరికి గుర్రం స్వాతంత్ర్యం ప్రకటించింది. ముందు ఆగి

పోయింది. జటకావాడు దాన్ని బదిరించేడు, అదిలించేడు. లాభం లేక పోయింది. కమ్చీ ఛళ్‌మనిపించేడు. గుర్రం వెనక్కి నడిచింది. మళ్ళీ ఛల్‌ఛల్‌మనిపించేడు. దాని తల్లితో, అమ్మమ్మతో సంబంధం కలిపేడు. అది వెనక కాళ్ళతో ఫెడీమని తన్నింది.

జటకాలో రామనాథం బేజారై పోయేడు. బండిలో కూచోలేడు — బండి దిగలేడు. ఆపరాబాబూ అంటే 'దిక్కు పంతులు, ఇయాల దీని బాబులు కినికిరవాల' అంటాడు. చెప్పకుండా చెయ్యకుండా భీష్ముడిమీదికి దూకిన పార్థసారధిలా జటకావాడు నేలకి దూకేశాడు. జటకా వెనక్కి తూగిపోయింది. రామనాథం గుమ్మడికాయలా కిందికి దొర్లిపోయేడు. చావులమదుం సెంటర్లో. గబగబ లేచి దులుపుకు నిలబడ్డాడు. గుర్రం వెనక యడంకాలు బండి దండెకి ఇవతల పడిపోయింది. దాంతో అది మరీ కిర్రెక్కిపోయి ఫెడీ ఫెడీమని తన్నూ బండిని గిర్కీలు కొట్టించింది.

జటకావాడు 'పంతులూ పంతులూ...' అంటూనే ఉన్నాడు రామనాథం పెట్టే బెడ్డింగూ చంకల్లో ఇరికించుకొని 'శీఘ్ర మంత్రపలాయనమ్' అని గిరీశం చెప్పినట్టు చీకటి చీకటిగావున్న పక్క సందులోంచి అల్లిపురం దారి పట్టేశాడు.

రామనాథానికి గుర్రం అంటే మహా భయం. గుర్రం తోకలాంటి దేదైనా భయం. గుర్రంమార్కే భయం!

ఓ మాటతను రోడ్డుమీద పరాగ్గా నడుస్తుంటే పక్కనించే బుర్ మని స్కూటరు వెళిపోయింది. స్కూటర్ నడుపుతున్న అబ్బాయి వెనక టంచనుగా ఓ అమ్మాయి కూచుంది. ఆ అమ్మాయి జుట్టు అచ్చంగా గుర్రం తోకలావుంది. విసురులో ఆ గుర్రం తోకలాంటి జుట్టు రామనాథం మొహమ్మీద చళ్‌మనిపించి, రెండు సెకన్లు అతని కళ్ళల్లో 'ట్విస్టు'కొట్టి దూరమయిపోయింది. రామనాథం హడలిపోయేడు. టెంపరేచరొచ్చింది. గుర్రం తోకలాంటి ఆ స్కూటరుపిల్ల జుట్టు రామనాథం కళ్ళముందు మూడ్రోజులు నిద్రలో మెళుకువలో భామాకలాపం ఆడింది.

గుర్రాన్నే చూడక్కరలేదు. గుర్రంలాంటి మనిషిని చూస్తే చాలు. అంతెందుకూ గుర్రం గురించి వింటేచాలు రామనాథానికి గుండెల్లో పెంకె గుర్రం కదంతొక్కి, తలవంచి, డెక్కతో నేల దువ్వి, చలాంగున మీదికి దూకినట్టయి బెంబేలెత్తి పోతాడు.

అసలు రామనాథానికి ఆఫీసుపని, ఇల్లు తప్పితే వేరే వ్యాపకంలేదు ఇల్లెప్పుడూ బావురుమనే ఉంటుంది. కొన్నాళ్ళు రాత్రిపూట హోటలు కెళ్ళి భోంచేసేవాడు. ఈ వెధవ హోటలు మెతుకులు గుర్రాలుకూడా తినవండీ అన్నాడు ఓ రాత్రి తన పక్కనే వున్నతను. అంతే ఆ దెబ్బతో హోటలికి స్వస్తి. తరవాత కొన్నాళ్ళు వండుకున్నాడు. అది చాలా శ్రమనిపించింది. చివరికి ఓ వెధవ మేనత్తని తెచ్చుకున్నాడు.

పనిచేసే అప్పలమ్మ ముసిల్దయిపోయింది. 'బాబూ! శక్తి వుడిగి పోనాది. ఇక నాన్చెయ్యలేను. రేపటికాణ్ణించీ మా కోళ్ళొస్తాది' అప్పలమ్మ నోటీసిచ్చింది. అప్పలమ్మ కోడలు రెండ్రోజులు బాగానే చేసింది పని.

'ఒరే రావుడూ! అప్పలమ్మ కోళ్లుందే...ఎవరు? పార్వతి, మహ మంచిదిస్మీ, నోర్లేదు. ఎంచక్కా తన పని తాను చేసుకుపోతుంది. అది తోమిన చెంబులు, తప్పేలాలు మల్లెపువ్వులనుకో. అది తుడిచినచోట విస్తరంటూ వేసుకోకుండా వణ్ణం తినొచ్చు. మహామంచి ముండ. చిన్న ముండైనా నాలాగే దానికి చచ్చే చాదస్తం...' అత్త పార్వతికి పెద్ద సర్టిఫికేటిచ్చింది.

'ఒరే రావుడూ! ఏమిటో అనుకున్నా ఈపార్వతి ఉందే మహకాన్దిరోయ్! నాకు కారేజీల బైమై పోతూంది అంటూ దబ్బడు దబ్బడ ఆరంభించిందిరోయ్. దీన్ని గుర్రాన్ని అదుపులో పెట్టినట్టు గసాయించకపోతే లాభంలేదు...' మూడు రోజుల కిందట పార్వతికిచ్చిన సర్టిఫికేటు చింపేసింది అత్త.

రామనాథం బిత్తరపోయాడు. ఏం అనలేకపోయేడు. అత్త పార్వతిని గసాయించడం మొదలుపెట్టింది. పార్వతి అత్తని ఝుణాయించి పారేస్తోంది. గలగల గచ్చ పొదలా దులిపివేస్తుంది.

వారం రోజులు తిరగలేదు. ఓ సాయంత్రం అత్తకీ పార్వతికీ మధ్య యుద్ధం హోరాహోరీగా సాగిపోతూంది. రామనాథం గదిలో ఈజీ చైరులో కూచున్నాడు. బిక్కచచ్చి వున్నాడు. పార్వతి రామనాథం గది ముందు వరండామీది కొచ్చి అత్తని దులుపుతోంది. నీకో దండం, నీ పనికో దండం అంటోంది.

'ఓసబ్బో ఎవర్ని బెదిరిస్తావే! విలవిల్లాడిపోతున్నావు పెద్ద తరం చిన్న తరం లేకుండా. వెళ్ళు వెళ్ళు. నీ యబ్బలాంటి దింకోర్రొస్తుంది. నువ్వెక్కడ? గజ్జల గుర్రానివే. నాలుక్కాళ్ళూ యెగరేసి దాడు తీసేదానివి. నువ్వెక్కడ నిలకడగా పన్జేస్తావు. గజ్జల గుర్రం!' అత్త మరీ దులిపింది.

గుమ్మం తెర కిందనించి కదం తొక్కుతూన్న పార్వతి కాళ్ళవు పిస్తున్నాయి. పార్వతి కంఠం బొబ్బిలి యుద్ధంలో వెలమ వీరుల గుర్రాలు సకిలించినట్టే వుంది. రామనాథం నరాలు బిగుసుకుపోయాయి. మొగం తిరిగిపోయింది. ఆవాళ్నించీ పార్వతి పనికి వుద్వాసనైపోయింది.

రామనాథం నానాటికీ దిగజారిపోతున్నాడని అత్త గ్రహించింది. పాత జ్ఞాపకాలేమన్నా బాధిస్తున్నాయేమో అనుకుంది. కానీ అసలు జబ్బు తెలీదు.

'ఒరే రావుడూ! ఇలా ఆఫీసుకీ యింటికి వుస్సైపోతే నీ ఆరోగ్యం కాస్తా చెడిపూరుకుంటుందిస్మీ. తిన్న వణ్ణం వంటికి పట్టాలా? పాతమార్కెట్టు దగ్గిర ఎవరో దాసుగారు భారతం, హరికథలు బాగా చెపుతున్నాట్ట. ఓమారైనా వెళ్లి వినకూడదా? పుణ్యం పురుషార్థం ఉంటుంది. నన్ను కూడా వోసారి తీసుకెళ్ళరాదా?' అంది.

ఓ రాత్రి రామనాథం అత్తతో కూడా బయల్దేరాడు. ఆవాళ రాత్రి ఏదో కారణంవల్ల దాసుగారు భారతం ఆపి 'లవకుశ' హరికథ చెపుతున్నాడు. కథ రాములవారి అశ్వమేధయాగం దగ్గిరకొచ్చింది. దాసు యాగశ్వాన్ని బాగా వర్ణించేడు. సూర్యుళ్ళా మెరిసిపోతున్న ఆ గుర్రం

మెరుపులా పరుగెత్తిందన్నాడు. రామనాధానికి గుండెదడదళ్ళాడింది. వింటున్న వాళ్ళందర్నీ తోసుకొని గుఱ్ఱం తనమీదికే వచ్చినట్టయింది. అత్తని కూడా మర్చిపోయి యింటిదారి పట్టేడు. తోవపొడుగునా రాములవారి గుఱ్ఱం వెనకబాటునేవచ్చి మట్టుకుపోతుందేమో అని బెదబెదలాడిపోయేడు.

తిని కూచోలేక ఈ అశ్వమేధయాగాలు, గుళ్ళమేధయాగాలు ఏమిటి? గుర్రాన్ని విచ్చలవిడిగా వొదిలీడం, అది యెటెళ్తే ఎంతమేర వెళ్తే అక్కడందర్నీ మాతో యుద్ధం చేస్తావా? దాసోహం అవుతావా? అని కవ్వించడం అర్థవుందీ? కయ్యానికాలు దువ్వడం, ఒళ్లు తాటదేరిపోతే యిలాంటి పన్లే. కాని దేవుడుకదా రాములువారే యిలా యెందుకు చేసేరో అని నాలిక్కరుచుకున్నాడు రామనాథం.

రామనాథం కాలేజీలో చదూకొంటున్న రోజుల్లో అన్నిట్లో ఫస్టు. అతని మార్కులుచూసి తోటి అబ్బాయిలు కళ్లుకుట్టుకొనేవారు. అమ్మాయిలు ముచ్చటపడేవాళ్లు. వాళ్ళ వీధిలోనే వున్న ప్లీడరు వియ్యన్న కూతురు రమ రామనాథం సహాధ్యాయిని. అతనంటే ఆ పిల్లకి చెడ్డయిది. తండ్రితో తరచు రామనాథం 'జీనియస్సు' అంటూండేది. ప్లీడర్ ఆలోచించేడు, ఇదేదో వ్యవహారమే అనుకున్నాడు.

రామనాధం దుక్కద్దాల కళ్ళజోళ్ళోంచి అప్పుడప్పుడు రమకేసి చూసేవాడు. పాఠాలు అర్థం చేసుకోవడంలో అతనికి మంచి తెలివుంది. కాని అమ్మాయి చూపుల్లో లిపి చదవలేడు. రమ తన భార్య అయ్యిందంటే నమ్మలేక పోయేవాడు కొత్తలో. అతనికో పెద్ద కంపెనీలో చిన్న గుమస్తా వుద్యోగమైంది. ముందు ముందు అల్లుడు పెద్ద ఆఫీసరౌతాడని ఆశపడ్డాడు వియ్యన్న వకీలు. కాని రామనాధం ఆఫీసరవలేదు. ఆ ఆఫీసులో కొందరు లా గ్రాడ్యుయేట్లు కూడా గుమస్తా పనిచేస్తున్నారు.

అసలు కథ యిక్కడే మలుపుతిరిగింది. ఆఫీసు సిబ్బంది అంతా ఏదో ఉత్సవం జరిపిస్తున్నారు. జనరల్ మేనేజర్, ఆయన సతి మొదలు ఆడా మగా చాలామంది వున్నారు. అక్కడ అనుకోకుండా రమ రెండు

మూడు పాటలు పాడవలసివచ్చింది. అందరూ బలవంతం చేసేరు. రమ రామనాథం వేపుచూసింది. అతను దుక్క కళ్లద్దాల్లోంచి నవ్వుతూ 'యస్' అని తలవూపేడు. చాలా బాగా పాడింది! 'సింప్లీ బ్యూటీఫుల్' 'అహ-ఒహో' 'కోయిల' 'భరత పక్షి' రకరకాలుగా పొగిడేరు అంతా. రామనాథం సంతోషం, గర్వం జోడుగుర్రాల బగ్గీ మీద తేలిపోయాడు ఆకాశంలో మబ్బుల అంచులమీద.

ఇంటికి వచ్చేకా రమ బుంగమూతి పెట్టింది.

'నన్నెందుకలా తోసేరు అందర్లోకీ?'

'గుర్రం! నువ్వేమంటున్నావో నాకర్థం కాలేదు. నిన్నంతా అలా పొగుడుతుంటే, నువ్వీ మాటలేవిటి?'

'పోనిద్దురూ, ఎప్పుడో చిన్నప్పుడు నేర్చుకున్న సంగీతం. తప్పులొస్తాయేమో అని భయమేసింది...'

'అందులో, తప్పులున్నాయో వొప్పులున్నాయో ఎవరికి తెలుసు. మా ఆఫీసు వాళ్ళందరికి సంగీతం 'హి|బ్రూ' సమానంగా తెలుసు. ఇంతకీ నీ కంఠం కమ్మగా ఉంది. నువ్వుకూడ...'

'చాల్లెద్దురూ...'

'సరేగాని నీ దగ్గిర సంగీతం నేర్చుకుందికి కొందరు పిల్లలొచ్చేలాగుంది. మా జి. యమ్. భార్య అంది 'మిస్టర్ రామనాథం, నీ భార్య చాలా టాలాంటెడ్ లేడీలా వుంది. మన సమాజంలో ఆమె ఏదైనా ముఖ్యపాత్ర నిర్వహిస్తే సమాజానికి చాలా వుపయోగంగా ఉంటుంది అని.'

'ఎందుకులెద్దురూ, మనకొక హోదాలేదు. హోదా కోసం నేను పాకులాడ్డం లేదనుకోండి. అయినా మనకెందుకూ అనౌసరం బెడద.'

'నువ్వు తెలివైనదానివేగాని, అప్పుడప్పుడు ఫూల్‌లా ప్రవర్తిస్తావు. ఇది నవయుగం. ముందుకొస్తే ముందుగతి; వెనకబడితే వెనకే—' చిన్న వుపన్యాసం యిచ్చేడు.

రామనాథం పెళ్ళాన్ని 'గుర్రం'అని ముద్దుగా పిలిచేవాడు. రమ నిజంగా పంచకళ్యాణి గుర్రంలా వుంటుంది.

రమ— రమాదేవి... కాలనీ మహిళా సమాజం సాంస్కృతిక శాఖకి కార్యదర్శిని అయింది. పిల్లలకి డ్యాన్సు బడి తెరిపించింది. సంగీతం, హిందీ తను స్వయంగా చెపుతూంది. మందకొడిగా నున్న సమాజం కొత్త చైతన్యం పుంజుకుంది. పెద్ద పెద్ద ఆఫీసర్ల భార్యల దృష్టిలో ఆవిడ ఒక 'మస్ట్'గా తోచింది.

రామనాథం నడకలో టెక్కొచ్చింది. భార్యతో కొత్త దర్జాలో వూళ్ళో షాపింగుకి వెళ్లుతున్నాడు. ఆమెని తోవలో ఎందరో పలకరిస్తారు. ఎన్నో వ్యాపకాలు. అతన్ని పలకరించే వాళ్ళరుదు.

రమాదేవి ఎక్కడికైనా వెళ్ళాలంటే కంపెనీ కారో, వ్యానో దొరుకుతూంది. సాయంత్రం వేళైతే భార్యతో రామనాథం కూడా వెళ్ళేవాడు. అప్పుడు ఆ డ్రైవరు భార్యతోబాటు తనకీ సలాం పెట్టేవాడు. ఎక్కినప్పుడూ, దిగినప్పుడూ తలుపుతీసి పట్టుకునేవాడు. ఇతర సమయాల్లో తనకి సలాంమాట దేవుడెరుగును, తనని చూస్తూనే సిగరెట్టుదమ్ము గట్టిగా లాగి మొహం అటు తిప్పేవాడు.

కాని రామనాథం యిదేం పట్టించుకోలేదు. భార్యకి కాఫీపెట్టి యివ్వడం, ఒక్కొక్కప్పుడు ఆవిడ ఇంటికి రావడం ఆలస్యమైతే వంటచెయ్యడం సరదాగానే వుంది.

ఒక సంవత్సరం దొర్లిపోయింది.

'ఏమండి — మీకో మంచి వార్త చెప్పనా ?'

మొగుడివేపు గోముగా చూస్తూ అంది. రామనాథం 'ఏమిటి' అన్నట్టు చూసేడు.

'ఇవాళ నన్ను మహిళా సమాజం కార్యదర్శినిగా ఎన్నుకున్నారు...'

రామనాథం తన చెవుల్ని నమ్మలేకపోయేడు.

'గుర్రం : కంగ్రాట్స్' అని చెయ్యిజాపేడు.

'నేనీ బరువు మొయ్యలేనండి అంటే జి.యమ్. భార్య వొప్పుకో లేదు. తప్పనిసరైంది...'

* * *

'వీల్లేదు. నువ్వు కాదనకు. నీవంటి వుత్సాహం, టాలెంట్‌గల యువతి జనరల్ సెక్రటరీగా వుండాలి, తప్పదు' జి. యమ్. సతి.

'క్షమించండి. నాకు కొన్ని ఇబ్బందులున్నాయి.'
ఏమీ ఇబ్బంది వుండదు. ఈ పదవిని నీవు స్వీకరించితీరాలి. అంతే...' చీఫ్ ఇంజనీరు భార్య ఖచ్చితంగా చెప్పింది.

'మీకు తెలీదు. ఈ పనికి, నా పరిస్థితికి నప్పదు. ఎలాచెప్పేది...' నేను దీనంగా అన్నా.

'నాకు తెలుసు. ఏదైనా ఒక కార్యం తలపెడితే, కావలసిన వాళ్ళందర్నీ గబగబ కలుసుకొని, పని చకచక సాగించాలి. అంచేత పదిరోజుల్లో మీయింట్లో ఫోను పెట్టిస్తా...' జి.యం. భార్య.

* * *

'మొత్తానికి ఈ ముళ్ళకిరీటం నా తల మీద పెట్టేరండి.' రమాదేవి టేబిలు ముందు కూచుంటు అంది. రామనాథం ప్లేట్లు సర్దుతున్నాడు భోజనానికి.

ఫోన్ ? తన యింట్లో ... అతని తల తిరిగిపోయింది.

ఇంట్లో ఫోను, యింటి ముందు వ్యాను !

' ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్ ! '

రామనాథం ఫోనెత్తేడు.

' హలో — ఎవరు ?'

... ... ... ...

'ఇంట్లో లేరు. '

... ... ... ...

'చెప్పలేను. రెడ్ క్రాసు మీటింగుకి వెళ్లింది.'

... ... ... ...

'చెప్తా ... ఎవరు ? ... సేవలు ఆఫీసర్ల భార్యల' సంఘం ... సెక్రెటరీ ...'

... ... ... ...

'నో మెన్షన్.'

ఫోను దింపేడు.

ట్రింగ్ ట్రింగ్ ...

'హల్లో ...'

... ... ... ...

'లేదు' ...

... ... ... ...

'ఊళ్ళోలేదు. హైదా్రాబాదు వెళ్ళింది. గవర్నరు సతి పిలిచింది.'

... ... ... ...

'క్షమించండి. అవేమీ నాతో చెప్పలేదు.'

... ... ... ...

'నాలుగైదురోజులవుతుంది ...'

... ... ... ...

'ఉమెన్స్ నైటా. అదేవిటో నాకు తెలీదు. క్షమించండి'.

... ... ... ...

'నో మెన్షన్.'

రామనాథం చచ్చిపోతున్నాడు ఫోన్లో జవాబులు చెప్పలేక.

కాలనీ మహిళా మండలి సెక్రటరీ అయిన మరునిమిషంనించి రమాదేవి అవకాశం యిస్తే స్త్రీ ఏంచేయగలదో చూపించింది. ఆమె సమయస్ఫూర్తి, సమస్యల్ని ధైర్యంగా యెదుర్కొని పరిష్కరించే శక్తి స్త్రీలనే కాదు, పురుషుల్ని కూడా ఆశ్చర్యపరిచేయి. ఆమెకి అలుపు లేదు. విసుగు లేదు. ఆమె శరీర శక్తికి తరుగు లేదు. ఆమె చైతన్యం కాలనీ పొలిమేర్లు దాటి ఊళ్ళోకి వ్యాపించింది. మహిళాసమాజాలు, బీదకారుణ్య సంఘాలు, చేతి పనులు, కుటీర పరిశ్రమ కేంద్రాలు ... అన్నిటితో ఆమెకి సన్నిహిత సంబంధం వుంది.

మానవ సమాజం ఒక సినిమా హాలు వంటిది. ఒక హద్దువరకే స్త్రీ పురుషభేదం. తరువాత అంతా ఒకటే. రమాదేవి ఆ హద్దు దాటిపోయింది. రామనాథం కంచెఅవతలపడిపోయేడు. సభలకీ, సమావేశాలకీఆమెతోపాటు

అతనికి ఆహ్వానాలందుతాయి. అలాంటి చోట అతనికి సరదాకి బదులు బాధేస్తుంది. ముళ్ళ మీదున్నట్టుంటుంది. తననెవ్వరూ చూడనట్టు, ఖాతరు చెయ్యనట్టుంటుంది.

మొదట్లో ఆవిడ హైదరాబాదు, విజయవాడ, గుంటూరు మొదలైన వూళ్ళు తన పనిమీదో, ఆహ్వానం మీదో వెళ్ళినప్పుడు తోకలా తనూ వెళ్ళేవాడు. వెళ్ళి అగస్త్యభ్రాతలా ఆమె వెనకతిరిగేవాడు. కాని ఎక్కడా అతనికి ఆవాహన, విసర్జనా లేదు. పైగా నవ్వులపాలయేవాడు. తెలీక కొందరు అతన్ని ఆవిడ గుమస్తా అనుకునేవారు. తెలిసీ కొందరు పెంకెతనానికి 'రమాదేవి గుమస్తా' అనేవారు. తరచు అతను ఏడవలేక నవ్వేవాడు

రమాదేవి వుపన్యాసాలు మొదట పత్రికల్లోకెక్కాయి. తరువాత ఆమె వ్యాసాలు రాసింది. ఆమె పిల్లల గురించి రాసినా, ఆవకాయ మీద రాసినా, అమ్మమ్మ గురించి రాసినా పత్రికలు ప్రకటించేయి. పాఠకులు ప్రశంసించేరు. ఆమె ఎక్కడికెళ్ళినా సన్మానమే. ఏంరాసినా బహుమానమే. ఆమె కార్యక్రమానికి అంతులేదు. ఆమె పులివేషం కట్టి ఆడుతుంటే రామనాథం తోక పట్టుకున్నవాడిలా గిలగిల్లాడిపోతున్నాడు.

విజయవాడలో యిళ్లు కాలిపోయినా, బీహారులో కాటకం రెచ్చిపోయినా, శ్రీకాకుళం జిల్లాలో టొక్కున వాన చినుకు రాలకపోయినా, టీబీ సీళ్ళు అమ్మి డబ్బు సంపాదించ వలసొచ్చినా, కుటీర పరిశ్రమల ప్రదర్శన జరిగినా, కుటుంబ నియంత్రణ ఉత్సవాలు జరిగినా, ఏమైనా, ఎక్కడైనా రమాదేవికి తలమునిగిన పని. ఎక్కడిదీ బలం? అతని కర్థం కాలేదు. ఆమెని ఆహ్వానించినవాళ్ళల్లో కొందరు అతనిక్కూడా రానూపోనూ ఛార్జీలిస్తారు. కాని కొందరివ్వరు. అప్పుడు చేతి చమురే - నాలుగ్గుంజీలు తీయించి నాలుగణాలు ఫైనన్నట్టు.

భార్య తనకి దూరమై పోతుందేమో అని బెంగపడ్డాడు. కంచెకి పైనున్నవాళ్ళలా బెంగపడరు. అక్కడ ఎవరి కార్యక్రమాలు వాళ్ళవి.

ఒక స్త్రీ తారాజువ్వలా పైకిలేస్తుంటే, చుట్టుపక్కలవాళ్లలో ఈర్ష్య, తారాజువ్వలా లేస్తుంది. చూపుడువేళ్లు గురి పెట్టిన పిస్తోళ్లవుతాయి. గుస గుసలు గుచ్చుకుంటాయి. వెకిలి నవ్వులు కుడతాయి.

'ఏంరోయ్ రామనాథం ... ఇలా నడిచొస్తున్నావు. ...' తోటి గుమస్తా ఆచారి అడిగేడు. ఆచారి గొంతుక ఆమడ దూరం వినిపిస్తుంది.

'బజార్నించి ...'

'అదేమిటీ! గంట కిందట మీ ఆవిడ వ్యాన్‌లో వెళ్ళిపోతూ వూళ్ళో కనిపించింది. ఆవిడతో ఆడా మగా చాలా మందున్నారు ... నిన్నావి లేసిందా ... బజారుకు తీసికెళ్ళకుండా ?'

రామనాథం జవాబు చెప్పలేదు.

ఆచారి కొంచెం దూరంలో వున్న బస్సుదాకావెళ్ళి అక్కడున్న స్నేహితులతో అన్నాడు—

'ఒరే చూడండ్రా. మన రామనాథంగాడు, వాడి పెళ్ళాం కార్లమీద షికార్లు కొడుతుంటే తను కాళ్ళ సవారీ చేస్తున్నాడు. దద్దమ్మ...' అమ్మ లక్కలు కూడా జెలసీకొద్ది రమాదేవి మీద గుసగుసలారంభించేరు.

'గుర్రం! ఇలా తిరిగితే ఆరోగ్యం చెడిపోతుంది. నీ కార్యకలాపాలు కొంత తగ్గించుకో. కొంత విశ్రాంతి తీసికో...,'

'విశ్రాంతికి తీరిక లేదండి....'

ఆ జవాబు ఎన్నోసార్లు విని విసిగిపోయాడు. ఒకొకప్పుడు ఆమె విశ్వాసాన్ని కూడా శంకిచేవాడు. ఆ అనుమానం అతన్ని మరీ క్రుంగ దీసింది. మనిషి అతని విశ్వాసాన్ని కోల్పోతే ఇతరుల విశ్వాసాన్ని శంకిస్తాడు. హృదయ వైశాల్యం పెరిగితే, ఇరుకులోంచి. యిరుల్లోంచి గాలి వెలుతుర్లోకొస్తె, కుళ్ళు కాలవలు, నూతి దగ్గర పది కుటుంబాల వాళ్ళు చేసే రొచ్చు, ఉమ్మడి మరుగుదొడ్ల రోతనించివిముక్తి పొందితే, మనస్సు డెట్టాల్ పరిమళం పరిశుభ్రత నిండితే విశ్వాసపు కుక్క కరవదు. కానీ రామనాధాన్ని అది కాట్లకుక్కలా కరుస్తూంది.

రోడ్డు మీద నడుస్తున్నా, హోటలులో కాఫీ తాగుతున్నా, చివరికి ఆఫీసులో పనిచేసుకుంటున్నా, కొంటె చూపులు, అణుచుకున్న నవ్వులు, హేళనగా ఆవలింతలు, సకిలింపులు అతన్ని వేటాడుతున్నాయి.

అంతస్తులలో రమకి తనకి చాల తేడావొచ్చింది. డబ్బు విషయంలో కూడా అంతే. ఎన్నో సంస్థలిచ్చే ఆనరోరియముల ద్వారా పత్రికలు, పుస్తక ప్రచురణ సంస్థలు యిచ్చే రెమ్యూనరేషను వల్ల ఆమె బ్యాంకు బ్యాలెన్సు బాగా పెరిగింది. ఆర్థిక స్వాతంత్ర్యం వున్న స్త్రీకి అదిలేని స్త్రీకి బంగారానికిప్లాస్టిక్కి వున్నంత తేడా.

' ఇరవై ఒకటో తారీఖు హైదరాబాదు వెళుతున్నా. టికెట్టు కొని రిజర్వేషను చేయించండి...'

' అలాగే... '

ఆమె తనని రమ్మనలేదు. ఒక వేళ రమ్మన్నా ఎందుకు ? తన డిపార్టుమెంటల్ హెడ్డు వెంకట్రామన్ సెలవియ్యడానికి గునుస్తాడు. వాడి

నోరు మంచిదికాదు. ఓమాటు నవ్వుతూనే అన్నాడు. 'మిష్టర్ రామనాథం నువ్వు చేస్తే ఆఫీసులోనైనా పనిచేయ్, లేకుంటే మీ ఆవిడ దగ్గరైనా చెయ్' అని.

టికెట్టుకొని, రిజర్వేషన్ చేయించాడు. ప్రయాణం రోజున భార్యని దిగబెట్టడానికి స్టేషన్ వరకు వెళ్ళాడు.

సాయంత్రం ఏడు గంటలకి ఎక్స్‌ప్రెస్ వచ్చింది.

'ఇదేవిటి రిజర్వేషను మీ పేరనుంది...'

రామనాథం చూసేడు. తనపేర ఉంది. ఆ కూపేలో యిద్దరే ప్రయాణీకులు. తనూ ప్రొ॥ టి. శంకరయ్య.

రమ పేర టిక్కెట్టు కొనాలని, రిజర్వేషను చేయించాలని అతనికి తట్టలేదు. తనపేర ఆమె ప్రయాణం చేస్తుందనుకున్నాడు. తెలివి తెల్లవారింది.

'సరేలెండి — ఇప్పుడేం కొంపమునిగిపోయింది' రమ సర్దుకుంది. కాని అతనికి సమాధానంగా లేదు. ఎవడీ ప్రొఫెసరు తిక్కశంకరయ్య? ముసిలాడా? కుర్రాడా...?

రామనాథం కండక్టరు వెనకపడ్డాడు. ఏదైనా మార్పుచెయ్యడానికి ప్రయత్నిస్తానన్నాడు కండక్టరు. కాని లాభంలేకపోయింది. అయామ్ సారీ. ఈ రాత్రి ఆమె ప్రొఫెసర్‌తో ప్రయాణంచేసి తీరాల్సిందే. కాదంటే ప్రయాణం మానెయ్యాలి. అయినా గాభరా పడతారెందుకూ — ఆవిడకి మంచి సహాయం దొరికింది హేపీగా వుండండి అని కండక్టరు నవ్వి మరోవేపు వెళ్ళేడు.

రామనాథానికి మతి పోయింది.

ట్రైమైపోతోంది. మరో ఐదు నిముషాల్లో బండి కదుల్తుంది.

ప్రొ॥ టి. శంకరయ్య హడావుడిగా వచ్చేడు. ముప్ఫై అయిదేళ్ళుంటాయి. పిల్లిగడ్డం, నోట్లో పైపు. తన రిజర్వేషన్ చూసుకున్నాడు.

ప్రొఫెసరు తొందర తొందరగా మాట్లాడుతాడు. 'అహ్హాహ్హాహ్హా' అని నవ్వుతాడు. ... కూపేలోకొస్తూనే రామనాథాన్ని చూసి 'గుడీవినింగ్' అన్నాడు. రమాదేవి ఓవారగా వుంది. బెర్తుమీద అటాచి కేసు పెట్టి అటు తిరిగి ఆమెని చూసేడు. నోట్లోంచి పైపు తీసి - 'మీరు ... మీరు ... రమా... ఓయస్ రమాదేవి' అని అహ్హాహ్హాహ్హా అని నవ్వేడు.

రమాదేవి అతనికి నమస్కారం చేసి భర్తని పరిచయం చేసింది.

'మీరిద్దరూ హైదరాబాదొస్తున్నారా? వెరీగుడ్. ప్రయాణం హాపీగా వుంటుంది. అహ్హాహ్హా...!' పైప్ గుప్ గుప్‌మనిపించి రామనాథం మొహం మీద కొదిలేడు పొగ.

'నేను రానండీ, ఆమే వస్తోంది ...'

'అలాగా... వెరీగుడ్— నేను మీ భార్యని బోరుకొట్టి పిచ్చెక్కిస్తానేమో అని భయంగా వుంది అహ్హాహ్హా'— పైపుతీసి నవ్వి, మళ్ళీ పైపు నాలుగు దమ్ములాగేడు.

రామనాథం జరిగిన పొరపాటు చెప్పేడు. గంట మోగింది. గార్డు విజిలూదేడు. ఇంజనరిచింది. రామనాథం కిందకి దిగేడు.

'మిష్టర్ రామనాథం! బెంగపడకు, హాయిగా నిద్రపో, ఈ రాత్రికి మీ ఆవిడ పూచీనాది. అహ్హాహ్హా...'

జుఫ్ జుఫ్ రైలు కదిలింది.

రమాదేవికి ఢిల్లీలో వుద్యోగం అయినప్పుడే రామనాథం గుర్రం మీంచి పడిపోయేడు. స్త్రీలకి సంబంధించిన ఒక అంతర్జాతీయ సంస్థలో భారతదేశంలో అధికారిణిగా ఆమె నియమించబడింది. ఢిల్లీ నుంచి లండన్, న్యూయార్క్, పారిస్, బాన్ మొదలైన నగరాలు వుద్యోగరీత్యా తరచు వెళుతూంటుంది.

ఆమె వెళ్లిపోయింది.

మరి తిరిగిరాలేదు.

గుర్రం పారిపోయింది.

అందుకే రామనాథానికి గుర్రమంటే భయం.

అందుకే రాత్రి సినిమాలో గుర్రం నాలుక్కాళ్ళూ ఎగరేసి ఛంగున మీదకి దూకినట్లయి మూర్ఛపోయాడు. పాపం రామనాథం.